# నీకూ నాకూ మధ్య నిశీధి

బస్సులో లైట్లు వెలిగాయి.

కర్నూలు వచ్చేసింది.

సురేంద్ర తన చేతివాచీలో టైమ్ చూసుకున్నాడు.

ఒంటిగంట కావస్తోంది.

అనంతపురంలో తొమ్మిదికి బయల్దేరింది బస్సు. దాదాపు నాలుగు గంటల ప్రయాణం.

డిసెంబర్ చలి... ప్రయాణీకులు అందరూ మఫ్లర్లూ స్వెట్టర్లూ, శాలువాలతో మారువేషాల్లో ఉన్నట్టున్నారు.

సురేంద్ర పక్కన కూచున్న వ్యక్తి తన వస్తువులు సర్దుకుంటున్నాడు. ఆయన కర్నూల్‌లో దిగుతాడు కావచ్చు.

మరో ఐదు నిమిషాల్లో స్టాండ్‌లో ఆగింది బస్సు.

అంతవరకూ తూగుతున్న ప్రయాణీకు లొక్కొక్కరూ నెమ్మదిగా లేచి కిందకి దిగుతున్నారు. కాళ్ళజోము వదిలించుకోటానికి కొందరైతే, టీలు తాగటానికి కొందరూ...

సురేంద్ర పక్కన కూర్చున్న వ్యక్తి కుడిభుజానికో బ్యాగూ, ఎడమభుజానికో ఫ్లాస్కూ తగిలించుకొని, ఎడమచేత్తో సూట్‌కేస్ పట్టుకొని, కుడిచేత్తో బెడ్ హోల్డాల్ తీసుకోవటానికి ప్రయత్నిస్తూంటే చంకలోని బ్యాగ్ కిందికి జారింది. బ్యాగ్ సవరించుకొని మళ్ళీ ప్రయత్నం చేయబోతూంటే, సురేంద్ర కల్పించుకని "మీరు దిగండి సార్, మీ బెడ్‌హోల్డాల్ నేను తెచ్చి ఇస్తాను" అన్నాడు దాన్ని

తీసుకుంటూ. ఆయన కృతజ్ఞతగా సురేంద్రవేపు చూసి నెమ్మదిగా కిందికి దిగి రిక్షాను కేకవేశాడు. సురేంద్ర బెడ్‌హోల్డాల్‌తో దిగి వచ్చి దాన్ని రిక్షాలో ఉంచాడు. రిక్షా కదిలింది.

సురేంద్ర పదినిమిషాలటూ ఇటూ పచార్లు చేశాడు. మరో నాలుగు రోజుల్లో రాయబోయే ఎంట్రన్స్ పరీక్ష గురించీ తన ప్రయాణం గురించీ ఆలోచిస్తున్నాడు.

తెల్లారేసరికి హైదరాబాద్ చేరుతుంది బస్సు. చేరగానే మొదటి పని రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ చేయటం. రిజర్వేషన్ లేకుండా, ఢిల్లీకి, అంతదూరం ప్రయాణం చేయటం సాధ్యం గాదు. రిజర్వేషన్ దొరుకుతుందనే తన నమ్మకం. దొరక్కపోతే ఏం చేయాలి? అది అప్పుడు ఆలోచించాలి. అనుకున్నట్టుగా జరిగుంటే ఈ రాత్రి కె.కె. ఎక్స్‌ప్రెస్‌లో మోహన్‌తో పాటు అనంతపురం నుండే బయల్దేరేవాడు. మోహన్ రిజర్వేషన్ చేసుంటాడని తాననుకున్నాడు. అనుకోని విధంగా వాళ్ళమ్మకు సీరియస్ అయింది. తన ప్రయాణమే రద్దు చేసుకున్నాడు. ఇన్నాళ్ళూ ప్రిపేరయిందంతా వ్యర్థమే... తన ఒక్కనికైనా రిజర్వేషన్ చేద్దామని అనుకొన్నాడట... కుదరనేలేదట.. సారీ చెప్పుకున్నాడు. “సారీ ఎందుకురా–నీ పరిస్థితులలా ఉన్నాయి. నేను హైదరాబాద్ వెళ్ళి రాజధాని కాచ్ చేస్తాను. డోంట్ వర్రీ” అన్నాడు తను. మోహన్ని పరిస్థితులు ఇబ్బంది పెట్టి వుండక పోతే ఈ పాటికి ఇద్దరూ కలిసి కె.కె.లో ప్రయాణం చేస్తూండేవాళ్ళం. అనుకున్నాడు సురేంద్ర... ఢిల్లీదాకా ఒంటరి ప్రయాణం... భరించాలి.

సీట్లో డ్రైవర్ కూచొని యింజన్ స్టార్ట్ చేసే ప్రయత్నంలో ఉన్నాడు. ప్రయాణీకులు బస్సెక్కుతున్నారు. సురేంద్ర బస్సెక్కి తనసీటుదాకా వచ్చి ఆగిపోయాడు.

కర్నూల్ ప్రయాణీకుడు ఖాళీ చేసి వెళ్ళిన సీట్లో ఓ అమ్మాయి ధీమాగా కూచొనుంది. చెవులకు మఫ్లర్ చుట్టుకొనుంది. స్వెట్టర్ వేసుకొంది... ఎడమ కాలుమీద కుడికాలు వేసుకొంది... రెండు అరచేతులనూ వలలాగా అల్లి మోకాలి చుట్టూ బంధించి, డ్రైవర్ ముందున్న అద్దం వేపు చూస్తూ కూచొనుంది... అది టూసీటర్, అవతలివేపు తన సీటు. ఈ అమ్మాయేమో పక్కన మగవారున్నారా ఆడవారున్నారా అని కూడా ఆలోచించకుండా కూచొనుంది... ఆడవాళ్ళ సీట్లవేపు ఖాళీలేవైనా ఉన్నాయా అని అరక్షణం సురేంద్ర ముందుకు చూసి చాలించుకున్నాడు. ఈ సమస్య నెలా పరిష్కరించాలి?... “అయ్యో! నా పక్కసీట్లో ఓ ఆడపిల్ల కూచునుంది. నన్ను రక్షించండర్రా!...” అని అరిచే సమస్యేనా ఇది? సురేంద్ర పెదవులపై మందహాసం మెరిసింది... తన సీటు కూడా ఆమెకే వదిలేసి తాను మరో సీటులో కూచోవచ్చుగా అనుకొని ఆ మరోసీటు కోసం బస్సంతా ఓ క్షణం కళ్ళతో గాలించాడు... ఊహూ... లాభం లేదు... నో వేకన్సీ...

సురేంద్ర ఓ అడుగు ముందుకువేసి, ఆమెదాకా వచ్చి నిల్చొని ‘మేడమ్’ అన్నాడు మెల్లగా, ఆమె తలెత్తి అతని వేపు చూసింది. అతని చూపులు ఆమె ముఖం మీద నిలిచాయి– పెద్ద పెద్ద కళ్ళు, పల్చటి పెదవులు, ఎర్రటి ముఖం...

“ఆ పక్క సీటునాదండీ” అన్నాడు చాలా నెమ్మదిగానూ, వినయంగానూ.

ఆమె వెంటనే కాళ్ళు పక్కకు జరుపుకుంటూ "వెళ్లారా" అంది.

బస్సులో ప్రయాణీకులందరూ తనవేపే చూస్తున్నారా అనిపించింది సురేంద్రకు.

"మరెక్కడా సీటు లేదండీ! ఉన్నది యిదొక్కటే సీటు– తప్పదు రండి... కూచోండి" అందామె అతను వెళ్ళటానికి వీలుగా సర్దుకుంటూ–

అతడు ఆమె కేమాత్రం యిబ్బంది కలిగించకుండా వెళ్ళి తన సీట్లో కూచొని సర్దుకున్నాడు.

ఇంజన్ శబ్దిస్తూ ఉంది.

కండక్టర్ తలుపు వేసి తన చేతిలో వున్న పంచ్‌తో కడ్డీని రెండుసార్లు కొట్టాడు.

బస్ నెమ్మదిగా కదిలింది.

"ఎందువల్లో ఈ రోజు అన్ని బస్సులూ చాలా రష్‌గా ఉన్నాయి... మీరూ హైదరాబాదేనా వస్తున్నారు." ఆమె అతనివేపు తలదిప్పి చూసీ చూడనట్లు చూసి అడిగింది.

సురేంద్ర 'అవునండీ' అన్నాడు ఎర్రటి ఆమె కపోలంవైపు ఓ క్షణం చూసి... మఫ్లర్ చుట్టుకున్నందున ఆమె ముఖం మరీ స్పష్టంగా కన్పించలేదు.

ఆమె చొరవగా కూచోవటం, ఏమీ ఇబ్బంది ఫీల్ కాకపోవటం, అతి మామూలుగా మాట్లాడటం, సురేంద్రకు కొంత ఆశ్చర్యమనిపించినా, బాగా నచ్చాయి. ఎంత చదువుకున్నాళ్ళూ, మగాళ్ల పక్కన కూచోటానికే బెదిరిపోయే దశ యింకా ఇప్పుడు దాటలేదు. కాని ఈ అమ్మాయి అతి తేలికగా యీ విషయం తీసుకోవటం అద్భుత మనిపించక పోయినా ఆనందమనిపించింది సురేంద్రకు.

టూరిస్టుహోమ్ దాటగానే బస్సు స్పీడందుకుంది.

ఆమె మఫ్లరు వదులుచేసి తలమీద నుంచీ తొలగించి మెడపై జార్చుకొంది. సురేంద్ర ఆ క్షణం చూశాడు ఆమె మొఖాన్ని పూర్తిగా – అరె... ఎవరీమె... ఎక్కడ చూశాను? ఎక్కడ? నిజంగా ఎక్కడో చూశానీమెను... మనిషితో పరిచయం లేదుగానీ చాలాసార్లు చూశాడు తను... "ఎక్కడ చూశాను?" సురేంద్ర చాలా వేగంగా తీవ్రంగా ఆలోచించాడు. చాలా చాలా గుర్తుకు తెచ్చుకొన్నాడు. బాగా చూశాను... ఎక్కడ? ఎవరు? సురేంద్ర మెదడు చురుగ్గా పనిచేయసాగింది. ఔను... ఆమే... తనకు రెండేళ్ళ జూనియర్. చాలా ఫమిలియర్ ఫేస్... బాగా గుర్తున్న ఆ కళ్ళు – ఆ కళ్ళు చూసినప్పుడల్లా 'ఆమె కన్నులలో అనంతాంబరపు నీలినీడలు గలవు' అని గొణుక్కొనేవాడు తను. పేరు సుజాత. కాదు... అలాంటిదే... సుధ... అవును. ఆమెపేరు సుధారాణి... సురేంద్ర ఇక ఆగలేకపోయాడు. ఆమెవేపు తిరిగి "చూడండీ" అన్నాడు చాలా మెల్లగా. ఆమె అతనివేపు చూసింది.

"మీరు... మరేమీ అనుకోకండి... మీ పేరు సుధారాణి కదూ."

ఆమె నిజంగా ఆశ్చర్యపోయింది. కళ్ళల్లోనూ, పెదాలమీదా ఆ భావం స్పష్టంగా కనిపించింది. అతని ముఖం వేపు పరిశీలనగా చూసింది. మునిపంటితో పై పెదవి సుతారంగా అర్రక్షణం అదిమి వదిలేసింది. "అవునూ... మీరెలా..." అంటూ ఆగింది.

"మనం కర్నూల్ మెడికల్ కాలేజీలో చదువుకున్నామండీ- మీరు నాకు రెండేళ్ళు జూనియర్-మీతో నాకు పరిచయం లేదుగానీ మీరు నాకు బాగా గుర్తు" చాలా ఉత్సాహంగా చెప్పాడతను.

ఆమె అతనివేపుచాలా శ్రద్ధగా చూసింది. "అవునండీ! మీరూ గుర్తున్నట్లే అనిపిస్తున్నారు-ఒకసారి రాగింగ్ మీద చాలా తీవ్రంగా ఉపన్యసించినట్టు గుర్తు... మీరేనా... మీ పేరు..."

"నేనేనండీ! నాపేరు సురేంద్ర."

"సురేంద్రగారా... అయితే ఇప్పుడు గుర్తుకొస్తున్నారు- ప్రతిసంవత్సరమూ మన మేగజైన్‌లో లిటరేచర్ మీద మీ వ్యాసం ఉండేది గదూ..."

"అవునండీ..." అన్నాడు అదేదో తప్పపని చేసినట్టు కొద్దిగా సిగ్గుపడుతూ.

బస్సు కర్నూలు దాటేసింది...

బస్సులో లైట్లన్నీ ఆర్పేశారు... కండక్టర్ నెత్తిమీద ఒక నీలం బల్బు పల్చటి వెలుగునిస్తోంది- ఆ వెల్తురులో తన పక్క ఒక దివ్య శిల్పంలా ఉందనిపించింది ఆమె అతనికి.

బస్సు ఇంజన్ రొద ఎక్కువగా లేదు. ఆమె ఒకటి రెండు నిముషాలు మౌనంగా వుండి అతనివేపు తిరిగి "మీ హౌస్‌సర్జన్ పూర్తయి మూడేళ్ళయిందనుకుంటాను" అంది.

"అవునండీ..."

"ఎక్కడయినా ఉద్యోగం చేస్తున్నారా?"

"లేదండీ... రెండేళ్ళ క్రితం ఇంటర్వ్యూకి వెళ్ళొచ్చాను- వాటి గొడవలు మీకు తెలిసే ఉండాలి."

"అయితే యింతకాలం ఏం చేస్తున్నారు. ప్రైవేట్ ప్రాక్టీస్ ఏమేనా చేస్తున్నారా..."

"అవునండీ- మా ఊళ్ళోనే చేస్తున్నాను."

"చాలా మంచి పని చేస్తున్నారు. మనవాళ్ళు పల్లెల్లో ప్రాక్టీసంటే అదేదో తక్కువగా ఫీలవుతారు-"

"అలా చాలా తక్కువమంది ఉంటారులెండి- నా మిత్రులు చాలామంది యిప్పుడు పల్లెల్లోనే ప్రాక్టీస్ చేస్తున్నారు. మన ప్రభుత్వం మాత్రం పల్లెల్లో పనిచేసేవారికే ఉద్యోగాలు అని గొప్పగా అరుస్తోంది. పల్లెలేమిటి... అడవుల్లోకి వెయ్యమనండి- చేసేవారు చాలామంది ఉన్నారు. మన గవర్నమెంట్‌కు హాస్యరసం అంటే చాలా యిష్టం లెండి..."

ఆమె చిన్నగా నవ్వింది. "మీరన్న మాట నిజమే- ఇంతకూ మీ సొంత వూరు..."

"అనంతపురం దాటి ఇరవై మైళ్ళు వెళ్ళాలండీ- ధర్మవరం దగ్గర కనగానపల్లి మా ఊరు-" అని ఆగి "నాకు గుర్తున్నంత వరకూ మీ ప్రాపర్ కర్నూలే అనుకుంటా-" అనడిగాడు.

"మా నాన్నగారి ఉద్యోగరీత్యా చాలా కాలంగా కర్నూల్‌లో ఉంటున్నాము– నరసింగరావు పేటలో..."

ఆమె మెడమీద జారిన మఫ్లర్‌ను చెవులమీదుగా చుట్టుకుంది. ఆమె చెక్కిళ్ళ మీద ప్రతిఫలిస్తున్న పల్చటి నీలపుకాంతి అతణ్ణి ముగ్ధుణ్ణి చేస్తోంది– ఆమె అతని వేపు తిరిగి "ఒకే కాలేజీలో చదివిన మనం కొన్నేళ్ళ తర్వాత యిలా కలుసుకోవటం చాలా బావుంది" అంది.

సురేంద్ర నిజమన్నట్టుగా చిన్నగా నవ్వాడు.

"ఇంతకూ మీ ప్రాక్టీసెలా జరుగుతూoదండీ–" అంది మెడ కొద్దిగా అతనివేపు వాల్చి. అలా మెడ వాల్చినప్పుడు అంతదాకా సీటుకు అనుకొని వున్న ఆమె జడ ఇటువైపు వాలింది – వారిద్దరికీ మధ్య ఆమె జడ– 'నీకూ నాకూ మధ్య నిశీధిలాంటి నీ జుట్టు–' బుచ్చిబాబు గుర్తుకొచ్చాడు సురేంద్రకు.

"పల్లెల్లో ప్రాక్టీసెప్పుడూ బాగా జరుగుతుందండీ. ఉదయం ఏడు నుండీ రాత్రి పన్నెండు వరకూ పేషెంట్లే– వారు పిల్చినప్పుడల్లా పలకాలి – చూడాలి– చాలా ఓపికగా సమాధానాలు చెప్పాలి. నా సొంతవూరు అదే కావటంతో తీరికే లేనంత పని."

"బావుంది – చాలా బావుంది – మీ ఓపికకు మెచ్చుకోవాల్సిందే"

"ఇంతకూ మీ సంగతి చెప్పారుగాదు–"

"పి.జి. చేద్దామనే ఉద్దేశంతో నేను ప్రాక్టీసు అనుకోలేదండీ– హౌస్ సర్జన్ కాగానే అలా సరదాగా నాలుగైదునెలలు గడిచాయి. వారం క్రితమే కర్నూల్‌లో ఎంట్రన్స్ రాశాను– ఇప్పుడు–" అవి యింకా ఏదో అనబోతూండగా–

"నేనూ తిరుపతిలో ఎంట్రన్స్ రాసొచ్చానండీ–"

"వేరీగుడ్– మరి చాలా ఆలస్యం చేశారేం – ఇంతకాలం మీరు అనుకోనే లేదా–?"

"రెండేళ్ళక్రితం రాశానుగాని 'పెథాలజీకి'" సీటొచ్చింది – వెళ్ళబుద్ధికాలేదు. ఆ తర్వాత మళ్ళీ పరీక్షకెళ్ళటం కుదరనే లేదు. ప్రాక్టీస్ నన్ను వూపిరాడకుండా చేసింది– ప్రాక్టీస్‌చేస్తూ చదవటం కుదరదని మూడునెలల క్రితం తిరుపతి కెళ్ళి అక్కడే రూమ్ తీసుకొని ప్రిపేరయ్యాను–"

"ఈసారి బాగా రాశారా–"

"అలాగే అనుకుంటున్నాను– ఢిల్లీ ఆలిండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌కు కూడా అప్లయి చేశానీసారి– రూరల్ ఏరియాలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్న వాళ్ళకు ఐదుశాతం రిజర్వేషన్ ఉంది కూడా–అందుకేనండీ యీ ప్రయాణం–"

"అరే–చాలా ఆశ్చర్యంగా వుందే– మనమిద్దరమూ ఒకే బోట్‌లో ప్రయాణం చేస్తున్నామన్నమాట–"

"అవునాండీ– మీరూ ఢిల్లీ వస్తున్నారన్నమాట – మనమిలా కలుసుకోవటం వండర్‌గా ఉందండీ–"

బస్ కీచుమంటూ శబ్దం చేస్తూ తటాలున ఆగింది. తూగుతూన్న ప్రయాణీకులందరూ ఉలికిపడి లేచారు– సుధారాణి తల పక్కకు వంచి ముందుకు చూసింది – డ్రైవర్ బస్‌లో లైట్లు వెలిగించాడు–

"యాక్సిడెంట్–" ముందు కూచున్న ఎవరో అరిచారు.

ప్రయాణీకులందరూ గాబరాగా లేచి ముందుకు వచ్చి ఎదురు అద్దంగుండా తొంగితొంగి చూశారు–ఎదురుగా రోడ్డు పక్కన ఓ లారీ బోల్తాపడి వుంది. సురేంద్ర కూడా లేచి చూశాడు. "ఆ లారీ ముందు మనుషులూ అదీ చూస్తుంటే ప్రమాదం యిప్పుడిప్పుడే జరిగినట్టనిపిస్తోంది. అలా కిందికి వెళ్ళొస్తాను–" అని ఆమెను దాటుకొని వచ్చాడు...

ప్రయాణీకులందరూ దాదాపు దిగేశారు.

సురేంద్ర కిందికి దిగాడు.

అతని వెనుక సుధారాణి కూడా దిగింది.

లారీ రోడ్డు పక్కనున్న గోతిలోకి ఒరిగిపోయింది.

లారీలో ఏ సరుకూ ఉన్నట్టు లేదు.

లారీ చుట్టూ జనం.

ప్రమాదమెలా జరిగిందో అడుగుతున్నారు కొందరు– లారీడ్రైవర్ బస్‌డ్రైవర్‌తో ఏదో చెబుతున్నాడు– డ్రైవర్‌కే ప్రమాదమూ జరిగినట్టులేదు. డ్రైవర్‌కాక మరిద్దరొస్తున్నారట లారీ కాబిన్‌లో–క్లీనర్ కుర్రాడికి మాత్రం తలకు దెబ్బ తగిలిందట–

పన్నెండేళ్ళ క్లీనర్ కుర్రాడు రోడ్డు పక్కన కూచొని తల గట్టిగా పట్టుకొని చిన్నగా ఏడుస్తున్నాడు. సురేంద్ర ఆ కుర్రాడి దగ్గరకెళ్ళి "ఏదీ దెబ్బ ఎక్కడ తగిలింది" అనడిగాడు. ఎవరో చేతిలో వున్న బ్యాటరీ ఆ కుర్రాడి ముఖం మీద ఫోకస్ చేశారు ఆ కుర్రాడి ముఖమంతా రక్తం– చేతులంతా రక్తం–

"అయ్యో పాపం–" అన్నారెవరో జాలిగా.

"చాలా పెద్దదెబ్బ తగినట్టుంది" అన్నారు మరొకరు– అందరూ ఆ కుర్రాడివేపు జాలిగా చూస్తున్నారు. ప్రమాదాల్ని గురించీ, లారీడ్రైవర్ల నిర్లక్ష్యాల్ని గురించీ ఆ పక్కెవరో తీవ్రంగా ఉపన్యసిస్తున్నారు. కొందరు శ్రోత లతనికి తాళం వేస్తున్నారు.

సురేంద్ర ఆ కుర్రాడి తలవేపు పరిశీలనగా చూశాడు. 'ఒక శుభ్రమైన బట్ట కావాలి' అన్నాడు అక్కడున్న వారిలో ఒకరు ఒక పెద్ద చేతి రుమాలు అతని చేతికందించారు. సురేంద్ర ఆ బట్టతో ఆ కుర్రాడి తలమీద గాయాన్ని బాగా తుడిచాడు. సుధారాణి అతని పక్కనే నిల్చొని వంగి చూస్తోంది... దెబ్బ తగిలిన భాగం నుండీ తుడుస్తున్న కొద్దీ రక్తం వస్తోంది.

"రక్తం బలంగా వస్తోంది – పెద్ద దెబ్బేనేమో" అడిగారెవరో.

"తలమీదగాని, ముఖం మీద గాని ఏ చిన్నపాటి దెబ్బతగిలినా రక్తం బాగా వస్తుంది– రక్తాన్నిబట్టే ప్రమాదాన్ని నిర్ణయించలేము–" అంది సుధారాణి.

సురేంద్ర దెబ్బ తగిలిన భాగం జాగ్రత్తగా చూశాడు. "నథింగ్ డాక్టర్ స్కాల్స్ కొంచెం చీలింది" అన్నాడు ఆమెతో అదే గుడ్డతో ప్రెజర్ బాండేజ్ చేశాడు.

"ప్రమాదమేమీ లేదుగద సార్" లారీ డ్రైవర్ సురేంద్రను ఆతృతగా అడిగాడు.

"అలాంటిదేం లేదు. వెంటనే కర్నూల్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళి కుట్లు వేయించండి" అన్నాడు సురేంద్ర. లారీడ్రైవర్ అందించిన నీళ్ళ బకెట్‌లో తన చేతులు శుభ్రం చేసుకున్నాడు. ఇంతలో కర్నూల్ వెళ్ళే బస్సొకటి వచ్చింది. డ్రైవర్ ఈ జనసందోహాన్ని చూసి ఆపేశాడు. ఆ కుర్రాణ్ణి వెంటతీసుకొని ఒకరు ఆ బస్సులో వెళ్ళారు. ప్రయాణీకులు యాక్సిడెంట్ల కథలుచెప్పుకుంటూ బస్సు ఎక్కేశారు. సురేంద్రా, సుధారాణి తమ సీట్లలో కూచున్నారు. వాళ్ళిద్దరూ కుర్ర డాక్టర్లని ప్రయాణీకులు పసిగట్టేశారు–

డ్రైవర్ తన సీట్లో కూర్చున్నాడు.

కండక్టర్ తలుపు వేసేశాడు.

బస్సు కదిలింది.

సురేంద్ర వాచీకేసి చూసి "రెండున్నర" అన్నాడు.

ఆమె అతనివేపు చూసి "ఇక మన సంగతులు మాట్లాడుకుందామా మీరేమేనా కొంతసేపు తూగదల్చుకున్నారా?"

"అబ్బే... మీతో మాట్లాడటమే యిష్టం" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"ఊఁ... ఇక చెప్పండి. రేపు రాజధాని ఎక్స్‌ప్రెస్‌కేగా మీ ప్రయాణం. ఇంతకూ రిజర్వేషన్ చేయించారా..."

"లేదండీ వెళ్ళగానే ఆ ప్రయత్నం చేసుకోవాలి."

"అరెరే... రేపు రిజర్వేషన్ దొరక్క పోతే చాలా ఇబ్బంది పడతారే–అయినా మీ పల్లెనుండి ఎలా సాధ్యమవుతుంది లెండి రిజర్వ్ చేయటం... పోనీ అనంతపురం నుండి కె.కె.లో ఎందుకు ప్రయత్నం చేయకూడదు మీరు..."

కారణాలన్నీ వివరంగా చెప్పాడు ఆమెకు.

"అయినా చలికాలం గదా! పెద్ద రష్ ఉండకపోవచ్చు లెండి–రిజర్వేషన్ దొరుకుతుందనే ఆశిద్దాం."

బస్సు వేగం పుంజుకుంది. బస్సులో లైట్లు ఆర్పేశారు. నీలపుకాంతి ప్రయాణీకులమీద పల్చగా పరచుకొంది.

"మీరేమిటి మరీ ఒంటరిగా వస్తున్నారు. రిజర్వ్ చేయించారా?"

"ఏం ఒంటరిగా ఢిల్లీ వెళ్ళిరాలేననుకుంటున్నారా."

"ఢిల్లీ ఏంటండీ అమెరికా గూడా వెళ్ళిరాగలరు మీరు – కాలేజీ చదివేరోజుల్లోనే మీరు ధైర్యమైన మనిషని నాకు తెలుసు. అయినా దూరప్రయాణం గదా. ఒంటరితనం ఫీల్ కాకుండా..."

"నేను వెళ్తానన్నా ఇంట్లో వెళ్ళనిస్తారండీ! మా అన్నయ్య హైదరాబాద్‌లో ఉంటున్నాడు... మేమిద్దరమూ వెళుతున్నాము– మా యిద్దరికీ రిజర్వ్ చేశారప్పుడే."

"చాలా మంచిది" అన్నాడు సురేంద్ర

"ఏమిటి చాలా మంచిది..."

"మీరు ముందుగా రిజర్వు చేసుకోటం"

"మీకు కూడా రిజర్వ్ చేయిద్దాం లెండి... బస్సు దిగగానే మా యింటికి వెళ్దాం... మీ రిజర్వేషన్ గొడవ మా అన్నయ్యే చూసుకుంటాడు" అంది.

సురేంద్ర విస్తుపోయాడు.

"ఎందుకులెండి మీకు శ్రమ... నేను ప్రయత్నిస్తాను" అన్నాడు.

"ఈ ఫార్మల్ మాటలు వదిలెయ్యండి. లక్షణంగా నా వెంట రండి... అన్ని సంగతులూ మేం చూస్తాం..."

సురేంద్ర యింకేం బదులు చెప్పటానికీ తోచక నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"మీ స్పెషలైజేషన్ ఏమిటి?" అడిగిందామె.

"ఆర్థోపెడిక్... మీరూ"

"పీడియాట్రిక్"

వాళ్ళ సంభాషణ తమ సబ్జక్టుల గురించి కొనసాగింది.

బస్సు జడ్చర్ల చేరేసరికి ఐదయింది. బస్సు ఆగగానే చాలామంది ప్రయాణీకులు కిందికి దిగారు.

"మనమూ దిగి అలా కొద్దిసేపు పచార్లు చేద్దామంటారా" అడిగిందామె.

"పదండి" అంటూ లేచాడు చేతులు చక్కగా కట్టుకొని చిన్నగా వణుకుతూ.

"అవునూ... మీరేమిటి... స్వెట్టరూ మఫ్లరూ, ఏదీ లేకుండా మరీ నిరాడంబరంగా ఉన్నారు మంచి చలికాలంలో. బ్యాగ్‌లో ఉన్నాయేమో తీయండి."

"అనంతపురంలో కొందామనుకున్నాను... వీలు పడలేదు– హైదరాబాద్ వెళ్ళగానే కొనాలి... చలి నన్ను పెద్దగా బాధించదులెండి... రైతుబిడ్డను కదా" అంటూ చిన్నగా నవ్వాడు.

ఇద్దరూ కాంటీన్ హాల్ ముందు ఒకరి ప్రక్కన ఒకరు నెమ్మదిగా నడుస్తున్నారు.

"మీరు టీలాంటి వేమేనా తాగుతారేమో... వెళ్ళిరండి" అందామె.

"టీ తాగుతాను కాని ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ తాగటం అస్సలు నచ్చదు నాకు..."

"మీరు చక్కగా నచ్చారు నాకు. ఇలా వుండాలి కుర్రాళ్ళు అన్నాక– కొందరుంటారు చూశారూ... బస్సు పదిచోట్ల ఆగితే పది టీలు... ఆ టీలు తాగటానికే ప్రయాణం చేస్తున్నారా అన్నట్లు... పైగా టీలు తాగినప్పుడల్లా సిగరెట్లు పీల్చేయటం. డోకొస్తుంది. మీరు సిగరెట్ గట్రా తాగరా?"

"లేదండీ! ఆ అలవాటు కూడా లేదు"

"నాకు భలే నచ్చారండీ – ఇలాంటి చిన్న చిన్న విషయాల్లో కూడా మంచి పద్ధతు లుండేవాళ్ళంటే చాలా యిష్టం నాకు" అందామె అతనివేపు మెచ్చుకోలుగా చూస్తూ.

సురేంద్ర తెల్లటి పాలలైట్ల వెలుగులో, ఎంతో నిర్మలంగా ఉన్న ఆమె పెద్ద పెద్ద కళ్ళనూ, పల్చటి పెదాలనూ, మాటాడే తీరునూ ముచ్చటగా చూస్తున్నాడు. తామిద్దరూ అలా నిల్చొని మాటుడుతూండటం చాలా మంది దృష్టిని ఆకర్షిస్తూందన్న విషయం గుర్తించి కొంచెం గర్వం ఫీలయ్యాడు.

"పేపర్ వచ్చినట్టుంది... అలా స్టాల్ దాకా వెళ్ళి తేనా" అన్నాడు.

"తీసుకురండి... పెద్ద పెద్ద అక్షరాలు నేను చదివేస్తాను... చిన్న చిన్న అక్షరాలు మీరు చదివి విశేషాలుంటే చెబుదురుగానీ..."

సురేంద్ర వెళ్ళి పేపరు పట్టుకొచ్చాడు. వాళ్ళు పేపరు తిరిగేస్తూండగా ప్రయాణీకులు బస్సెక్కటం మొదలెట్టారు.

"ముందు బస్సెక్కుదాం పదండి– లేడికి లేచిందే పరుగని ఈ బస్సు ఏ క్షణమయినా మనల్ని వదిలేసి వెళ్ళొచ్చు" అంది.

ఇద్దరూ బస్సెక్కి తమసీట్లలో జారగిల బడ్డారు.

## 2

సరిగ్గా ఏడు గంటలకు హైదరాబాద్ చేరింది బస్సు.

సురేంద్ర తన సూట్ కేస్ ఒక చేతిలో పట్టుకొని మరో చేత్తో సుధారాణి సూట్ కేసు తీసుకొని "పదండి" అన్నాడు నిల్చున్న ఆమెతో–

"ఆ సూట్ కేస్ యిలా యివ్వండి" అందామె చేయి చాస్తూ

"ముందు మీరు నడవండి."

"ఇమ్మంటూంటే..."

"కదలండీ... మనం పోట్లాడుకుంటున్నాం అనుకుంటారు చూస్తున్నవాళ్ళు. అలా వెనక్కు చూడండి" అన్నాడు మెల్లగా.

ఆమె వెనక్కు చూసి తమవేపే చూస్తున్న కళ్ళను లెక్కబెట్టి చకచకా కిందికి దిగేసింది.

ప్లాట్ ఫామ్ మీద అడుగు పెట్టింతర్వాత "మనం ఇక్కన్నుంచీ నేరుగా బస్టాప్ కెళ్ళాలి. బస్ దొరికితే అరగంట కల్లా ఇంట్లో ఉంటాం" అంది సుధారాణి.

"మీ అడ్రసివ్వండి– నేను మధ్యాన్నం వచ్చి కలుస్తాను– మిమ్మల్ని బస్ ఎక్కించి నేను..." అంటూండగా

"ఏమిటి మరీ చిన్నపిల్లాడిలా చేస్తున్నారు. మీకన్నీ మంచి అలవాట్లున్నాయని అనవసరంగా మెచ్చుకున్నానే... నడవండి..." అంది తీవ్రంగా.

"తప్పదంటారా" అని నసిగాడు సురేంద్ర.

"తప్పదుగాని ముందా సూట్ కేసు ఇలా ఇచ్చి నావెంట రండి" అంటూ సూట్ కేసు తీసుకోబోయింది.

"ఫరవాలేదు లెండి. కాస్త బరువుగా ఉంది కూడా–"

"నేను మరీ అంత సున్నితమైన మనిషిని అనుకుంటున్నారా– అయినా నా సూట్ కేస్ మీరు మోస్తూవుంటే. నేను రెండుచేతులూ వూపుకుంటూ నడవటం

నా కవమానంగాదూ" అంటూ దాన్ని లాక్కొని "రండి" అంటూ ఎడమచేత్తో చీరకుచ్చెళ్ళు కొంచెం పైకి పట్టుకొని చకచకా నడిచింది.

ఇద్దరూ స్టాప్‌లో నిలబడ్డారు.

"ట్రైన్‌లో వస్తే మా అన్నయ్య యింటికి వెళ్ళటం చాలా తేలిక... కాచిగూడలో దిగి లోకల్ ట్రైన్ ఎక్కి జమైఉస్మానియాలో దిగితే అక్కడికి పది అడుగులు లలితానగర్. లలితానగర్‌లో ఉంటున్నాడు మా అన్నయ్య."

"అయనేం చేస్తున్నారు."

"ఉస్మానియాలో లెక్చరర్. అదిగో బస్సు వచ్చేస్తోంది–"

బస్సు మరీ బాధపెట్టకుండా స్టాప్ లోనే నిలబడింది.

ఇద్దరూ ఎక్కేశారు. రష్ లేదు... ఇద్దరూ ఒకసీట్‌లోనే కూచొన్నారు.

"సిటీ బాగా పరిచయమేనా మీకు–"

"ఇక్కడకు రావటం యిది మూడోసారి– పాసయింతర్వాత రిజిస్ట్రేషన్‌కు ఓసారి వచ్చాను– ఇంటర్వ్యూకోసారి వచ్చాను– మళ్ళీ యిప్పుడు–" అన్నాడు.

జమైఉస్మానియా దగ్గర దిగి ఇద్దరూ లలితానగర్‌వేపు నడక సాగించారు–

ఒక మలుపు తిరిగింతర్వాత "ఈ చివర్లో కనిపిస్తాంది చూడండి–అయిల్లే" అంది సుధ.

ఇంటి ముందాగి గేటుతీసి లోపలకడుగు వేస్తూ "రండి" అది సురేంద్రను–

మునివేళ్ళతో తలుపు తట్టింది–

తలుపు తెరచినావిడ సుధకేసి చూస్తూ "వచ్చేశావా సుధా–మేమూ అనుకుంటూనే ఉన్నాం–" అని సుధకు కాస్తా వెనుక వున్న కొత్త వ్యక్తిని చూసి ఎవరన్నట్టు కళ్ళతోనే ప్రశ్నించింది.

"నువ్వు కాస్తా తప్పుకోవోయ్ వదినా" అంటూ లోపలికడుగేసి "రండి సురేంద్రగారూ" అంది. సురేంద్ర షూస్ బయటే వదిలేసి బిడియపడుతూనే లోపలికి వచ్చి తన సూట్ కేస్ కింద ఉంచాడు.

"ఈవిడ మా వదిన ప్రభావతి... వదినా! వీరు కాలేజీలో నాకు రెండేళ్లు సీనియర్– యాక్సిడెంటల్‌గా బస్‌లో కలిశాం– ఈయనా ఢిల్లీ వస్తున్నారు–"

సురేంద్రచేతులు జోడించి ఆమెకు నమస్కారం చేశాడు.

ఆమె బదులు నమస్కారం చేసింది.

ఎర్రగా, సన్నగా, సుధ అంత ఎత్తే వున్న ఆమె సుధ వయసే అనిపించింది సురేంద్రకు.

"సుధా! వీరిని మీ అన్నగారి గదికి తీసికెళ్ళు – మీరేం ఇబ్బంది ఫీల్‌గాకండి సురేంద్రగారూ, మీరు పది నిముషాల్లో మా యింటి మనిషైపోవాలి– లేకపోతే మేం యిబ్బందిపడాల్సి వస్తుంది– ఏమే సుధా – నిజమేనా–"

"ఈ పాటికి మా వదిన ఏమిటో మీకర్థమై ఉండాలి. మీరు మీ సూట్ కేస్‌తో యిలా రండి సురేంద్రగారూ" అంటూ కదిలింది సుధ.

సురేంద్రకు వీళ్ళు చాలా కొత్త మనుషులనిపించింది. సూట్‌కేస్ పట్టుకొని ఆమె వెనకాలే పక్కగదిలోకి నడిచాడు.

"ముందు మీరు మీ బట్టలు విప్పేసి ఆ మూలవున్న బుట్టలో వేయండి – ఓ లుంగీ చుట్టుకొని మీ బ్రష్ తీసుకొని పెరట్లోకి రండి–ఊ–క్విక్" అని చెప్పి తాను బయటకు వెళ్ళింది.

వంటగది తలుపు దగ్గరాగి "వదినా! రెండు బకెట్లు వేడినీళ్ళు కావాలి–తొందరగా–నేను బాత్‌రూమ్ కెళ్ళొస్తా" అంది.

"ఏమిటి విశేషాలు– ఎంట్రన్స్ బాగా రాశావా."

"అద్భుతంగా – ఇంతకూ మా అన్నయ్య నెక్కడకు తరిమేశావ్."

"మార్కెట్ కెళ్ళాడు–"

"బుజ్జి యింకా లేవలేదా–"

"నీ అరుపులకది లేస్తుంది – తొందరగా మీ కార్యక్రమాలు కానివ్వు–"

సురేంద్ర పెరట్లో నిల్చొని బ్రష్షూ, పేష్టూ చేతిలో పట్టుకొని నిల్చొన్నాడు– సుధ అతని దగ్గరకెళ్ళి "యిలా రండి– ఇక్కడ కూచొని మీ దంతధావనం కానివ్వండి – ఈ బకెట్లో నీళ్ళతో నోరు కడిగేసుకోండి. ఇంతలోగా బాత్‌రూమ్‌లో నీళ్ళు ఏర్పాటు చేస్తాను – స్నానం చేసేద్దురుగాని" అంది.

సురేంద్ర బుద్ధిమంతుడిలా పళ్ళుతోమటం మొదలెట్టాడు. పదినిముషాల తర్వాత ఆమె అక్కడికి వచ్చి "ఏమిటండీ! వీరావేశంతో ఎంత సేపైనా అలా తోమేయటమేనా? నోరు కడిగేసుకొని యిలా బాత్‌రూమ్‌లోకి వచ్చేయండి–" అంది.

అతను బాత్‌రూమ్‌లో కొచ్చేసరికి రెండు బకెట్లలో వేడినీళ్ళు సిద్ధంగా ఉన్నాయి. "చన్నీళ్ళవసరమయితే ఆ కొళాయి తిప్పుకోండి– తలస్నానం చేయండి– అక్కడ తలపిండి ఉంది చూడండి" అని చెప్పేసి తలుపడ్డం వేసి వెళ్ళింది.

వంటింటి గడపముందు స్టూల్ వేసుకొని "విశేషాలు చెప్పువదినా" అంటూ బాతాఖాని ప్రారంభించింది.

"ఏమున్నాయి నువ్వే చెప్పాలి–" అంటూండగా 'అరే– సుధీ వచ్చేసిందే' అంటూ అప్పుడే లోపలి కడుగు పెట్టాడు ప్రభాకర్ ఓ చిన్న సంచీ చేతిలో పట్టుకొని.

ప్రభావతి బయటకు వచ్చి "వకతే కాదండోయ్ ఓ కుర్రాణ్ణికూడా వెంట బెట్టుకొచ్చింది" అంది నవ్వుతూ.

"ఎవరా కుర్రాడు! ఏమా కథ" అన్నాడు ప్రభాకర్ చేతి సంచీ ఆమె కందిస్తూ.

సుధ విషయం చెప్పేసింది.

"అయన రిజర్వేషన్ చేసుకోలేదట. ఎక్కడో పల్లెలో ఉండేవాడు. ఎలా చేసుకుంటాడు? నువ్వు తొందరగా వెళ్ళి ఆయనకు రిజర్వేషన్ చేసుకురావాలి అన్నయ్యా."

ప్రభాకర్ అతని వివరాలు మరికొన్ని అడిగి తెలుసుకొన్నాడు–

సురేంద్ర స్నానం ముగించి వాళ్ళ మధ్యకు వచ్చాడు. తన అన్నయ్యను పరిచయం చేసింది సుధ.

"మీరిలా యాదృచ్ఛికంగా కలవటం చాలా మంచిదయింది సురేంద్రగారూ" అన్నాడు ప్రభాకర్.

సుధ బాత్‌రూం కెళ్ళింది.

ఇద్దరికీ కాఫీలు తెచ్చి ఇచ్చింది ప్రభావతి. ఇద్దరూ కూచొని మాటల్లో పడ్డారు.

బుజ్జి నిద్రలేచి దోగాడుకుంటూ వచ్చి కొత్త మనిషిని చూసి క్షణం ఆగింది. సురేంద్ర ఆ పాపను ఎత్తుకొని వడిలో కూచోబెట్టుకున్నాడు.

"మా అన్నయ్యకు ఇంతే అమ్మాయి ఉంది. నా దగ్గర చేరిక" అన్నాడు.

అందరూ టిఫిన్ కార్యక్రమం ముగించేసరికి పది దాటింది.

"అన్నయ్యా! నువ్వు తొందరగా స్టేషన్ కెళ్ళిరావాలి" అంది సుధ.

"నేను కూడా వారివెంట వెళతాను" అన్నాడు సురేంద్ర

"టికెట్ ఎవరిపేర రిజర్వు చేయాలనుకుంటామో, ఆ మనిషిని కూడా, బుకింగ్ క్లర్క్‌కు చూపించాలని ఈ మధ్య కొత్త నిబంధన పెట్టారా అన్నయ్యా" అంది సుధ.

అందరూ నవ్వుకున్నారు.

సురేంద్ర ఇచ్చిన డబ్బును జేబులో దోపుకొని ప్రభాకర్ స్టేషన్‌కు బయలు దేరాడు.

సురేంద్ర ఆరోజు పేపర్ చూస్తూ కూచొన్నాడు.

పన్నెండు కావస్తూండగా ప్రభాకర్ యింటికి వచ్చాడు. రాగానే సుధ "రిజర్వ్ చేశావా అన్నయ్యా" అనడిగింది.

"లేదు సుధీ... రిజర్వేషన్సు అన్నీ మొన్నటికే పూర్తయ్యాయట - ఎ.సి. కోచ్‌లో ఉన్నాయిగాని బోలెడు ఖర్చవుతుంది" ఇబ్బందిగా ముఖం పెడుతూ అన్నాడు ప్రభాకర్.

"ఇప్పుడేం చేద్దాం జనరల్ కంపార్ట్‌మెంటు చాలా రష్‌గా ఉంటుందేమో! పూర్తీ ఒక రోజు ప్రయాణం గదా! చాలా యిబ్బంది కలుగుతుంది బెర్త్ లేకపోతే ఆయనకు" అంది సుధ.

"ఏం యిబ్బందిలెండి. రెండు పుస్తకాలు ముందేసుకుంటే కాలక్షేపం అవుతుంది-" అన్నాడు సురేంద్ర.

అందరూ ముఖాలు వేలాడేసుకున్నారు.

"నేనో సూచన యివ్వనా?" అంది ప్రభావతి.

ఏమిటి అన్నట్టు చూశారు.

"సురేంద్రగారెటూ ఢిల్లీ వెళ్తున్నారు గదా! మీరు సుధీ వెంట వెళ్ళకపోతే నష్టం ఏమిటి? మీ బెర్త్ రిజర్వేషన్ ఆయన పేరుతో మార్పిడి చేయిస్తే. వాళ్ళిద్దరే వెళ్ళొచ్చుగదా! సుధకు తోడు కోసమే గదా మీరు వెళుతున్నది... సురేంద్రగారున్నారు కదా-" అంది ప్రభావతి ప్రభాకర్‌తో.

"అరే- ఈ ఆలోచన మనకు రానేలేదేమిటింత సేపూ - ఏం అన్నయ్యా! నీ కిష్టమేనా సురేంద్రగారితో నేను కలిసి వెళ్ళటం-" అంది సుధ.

సురేంద్ర విస్తుపోయాడు యీ మార్పుకు –

ప్రభాకర్ ఒక్కక్షణం మౌనంగా ఉండి "నీ యిష్టమమ్మా– మీరు వెళ్తామంటే నా కభ్యంతరమేమిటి? నువ్వేం చిన్నపిల్లవా–" అన్నాడు.

సురేంద్రకు ఏం మాటాడటానికి వెంటనే తోచలేదు–ఒక నిమిషం తర్వాత "నేను జనరల్‌లో వస్తాలెండి–" అంటూ ఏదో గొణగబోయాడు.

"ఏమిటి మీ అభ్యంతరం సురేంద్రగారూ! కర్నూల్ నుండి కలిసొచ్చాం గదా! ఢిల్లీదాకా కలిసి వెళ్తాం – ఎవరూ తోడు లేరనేగా మా అన్నయ్య వెంటవస్తున్నాడు – యిబ్బంది అంటూ ఫీల్ అయితే నేనేగా ఫీల్ కావాల్సింది– నా కేయిబ్బందీ లేదు – మీరు మరి మాటాడకండి – అన్నయ్యా! నువ్వు వెంటనే స్టేషన్ కెళ్ళి పేరు మార్పించుకురా అలాగే వచ్చేటప్పుడు ఓ మఫ్లరూ, నీసైజుది ఓ స్వెట్టరూ కొనుక్కురా. ఈ పల్లెటూరి పెద్దమనిషి రైతుబిడ్డనని వళ్ళువిరుచుకుంటున్నాడు" అంది సుధ.

"మరి నే వెంటనే వెళ్ళొస్తాను–" అని అవసరమైన కాగితాలు తీసుకొని బయటికి వెళ్ళాడు ప్రభాకర్.

సురేంద్రకంతా నాటకీయంగా కన్పించింది జరిగిన పరిణామం.

ఆమెతో తనకు పరిచయమేర్పడి యింకా ఇరవై నాలుగు గంటలు కూడా పూర్తికాలేదు. ఇంత తక్కువ సమయంలోనే తన్ను చిరకాల అప్తుడిలా ఆమె మన్నిస్తున్న తీరు అతని గుండెల్ని తడిపివేసింది.

రెండు కావస్తూండగా ప్రభాకర్ వచ్చాడు. పేరు మార్పుచేయించుకొచ్చానన్నాడు– సురేంద్రకు స్వెట్టరూ, మఫ్లరూ తెచ్చాడు – వాటిని చూసి సుధ చక్కగా ఉన్నాయంటూ మెచ్చుకుంది. అందరూ భోజనాలకు కూచొన్నారు– భోంచేస్తూ రేపటి ప్రయాణం గురించి చర్చించుకొన్నారు.

## 3

పొద్దున అరున్నరకల్లా ఆటోలో స్టేషన్ చేరుకున్నారు సురేంద్ర, సుధ, ప్రభాకర్ – రాజధానీ ఎక్స్‌ప్రెస్ సిద్ధంగా ఉంది. ఏడున్నరకు బయల్దేరుతుంది రైలు.

బాగా చలిగా ఉంది – మసకతెరలు యింకా విడిపోలేదు – స్టేషన్ సందడిగా ఉంది–

తమ కంపార్ట్‌మెంట్ చేరుకున్నారు వాళ్ళు – కంపార్ట్‌మెంట్ శుభ్రంగా ఉంది. వాళ్ళిద్దరివీ పైబెర్త్‌లు – సామాను పైన సర్ది కింది బెర్త్ మీద కూచున్నారు.

"రేపు ఉదయం ఎనిమిదింటికల్లా మీరు చేరుకుంటారు– వెళ్ళగానే మంచిలాడ్జి చూసుకోండి. మీ పరీక్షలకు ఒకరోజు టైమ్ ఉంటుంది– పరీక్షలు రాసింతర్వాత ఒకరోజు ఉండి సిటీ చూడండి."

"పన్నెండవ తేదీ ఉదయం కె.కె. ఎక్స్‌ప్రెస్ బయల్దేరుతుంది– దానికి రిజర్వ్ చేసుకోండి – పదమూడు ఉదయం యిక్కడికి చేరుకుంటారు– ఢిల్లీలో బాగా చలిగా ఉంటుంది– ఆరోగ్యం బాగా జాగ్రత్తగా కాపాడుకోండి– ఎక్కడికెళ్ళినా యిద్దరూ కలిసే వెళ్ళండి –" ఇలా జాగ్రత్తలు చెబుతున్నాడు ప్రభాకర్.

"మీరు సుధను జాగ్రత్తగా చూసుకోండి– తెలివైందేగాని కాస్త దుడుకు–" ఇలా సురేంద్రతో చెబుతున్నాడు.

"ఎన్నేళ్ళు గడిచినా మా అన్నయ్యకు నేను చిన్నపిల్లనే" అంటూ నవ్వింది సుధ.

"మధ్య మధ్య స్టేషన్‌లలో అనవసరంగా కిందికి దిగేయకండి – ఎక్స్‌ప్రెస్ ఎక్కడా కొద్ది నిముషాలకంటే ఎక్కువ ఆగదు– మీ సూట్‌కేసులూ అవీ జాగ్రత్తగా చూసుకుంటూ ఉండండి."

ప్రభాకర్ ఆదుర్దా సురేంద్రకు అర్థమవుతూనే ఉంది.

"మీరేం బెంగపెట్టుకోకండి ప్రభాకర్‌గారూ–" అన్నాడు సురేంద్ర.

గంటసేపూ యిలాంటి మాటలతోనే కాలక్షేపం చేశారు– ఇంతలో ఎక్స్‌ప్రెస్ కూతపెట్టింది.

ప్రభాకర్ లేచి నిలబడ్డాడు– ఆ కంపార్ట్‌మెంట్ అప్పటికే పూర్తి నిండిపోయి వుంది.

ప్రభాకర్ కిందికి దిగి "విష్ యు ఎ హేపీ జర్నీ–" అని వాళ్ళకు చెప్పాడు.

మరో రెండు నిముషాల తర్వాత ఎక్స్‌ప్రెస్ నెమ్మదిగా కదలింది– ఒకరికొకరు చేతులు ఊపుకొన్నారు–

"జాగ్రత్త సురేంద్రగారూ" అన్నాడు ప్రభాకర్ చేతులూపుతూ.

ఎక్స్‌ప్రెస్ మెల్లమెల్లగా ప్లాట్‌ఫాంను దాటేసింది.

"మీ అన్నగారు చాలా జాగ్రత్తలు చెప్పారు. ఆయన కూడా మనతో వచ్చేసి వుంటే యీ ఆదుర్దా వుండేది కాదు–" అన్నాడు సురేంద్ర.

"మీరు మాటాడేదేమిటో నాకర్థం కాలేదు నా భారం మీరే మోస్తున్నట్టుగా ఉందే... నాతో కలిసి ప్రయాణం చేయటం మీకు ఇష్టం లేనట్టుంది." అంది సుధ చిరుకోపం ప్రదర్శిస్తూ.

"మీతో కలిసి ప్రయాణం చేయటం నాకిష్టం లేకపోవటమేమిటి... ఢిల్లీ వరకే గాదు... మరెంత దూరమైనా సరే–"

ఆమె నవ్వింది. "ఇప్పటికి ఢిల్లీదాకా చాల్లెండి" అంది.

"నాకు దూరప్రయాణాలు ఎప్పుడూ అలవాటులేదు– ఒంటరిగా ఢిల్లీదాకా వెళ్ళటం, రావటం, ఇది చాలా పెద్దబోర్ అని నిన్నటిదాకా గుణించుకుంటూనే ఉన్నాను – మీతో కలవటం నాకెంతో రిలీఫ్ ఇచ్చింది సుధగారూ – ఒక అపురూపమైన అనుభవంలాంటిది జరుగుతున్నట్టు ఫీలవుతున్నాను–" అన్నాడు.

సుధ అతనివేపే స్నిగ్ధంగా చూస్తోంది.

"నా కాలేజీ రోజులన్నీ యిప్పుడు గుర్తుకొస్తున్నాయి సుధగారూ! నా కాలేజీ లైఫ్ అంతా చాలా డ్రైగా గడిచిపోయింది! ఏదో లోపం నన్నెప్పుడూ పట్టి పీడిస్తూండేది. ఆ లోపమేదో నాకిప్పుడు అనుభవంలోకి వస్తోంది– మీరు మరోలా అనుకోకూడదు" ఇలా చెబుతున్నప్పుడు అతని కళ్ళు ఎంతో నిర్మలంగా కనిపించి క్షణకాలం పరవశించిందామె... ఏదో చెప్పాలని అనుకొని ఆగిపోయింది.

"నిన్నట్నుంచీ నేనేదో కొత్తదనం అనుభవిస్తున్నాను. మీ సాహచర్యమే నాకీ అనుభూతిని కలిగిస్తోంది. నేను కాస్త అతిగా మాటాడుతున్నానేమో..." అని ఆగాడు సురేంద్ర.

ఆమె ఏం మాట్లాడలేదు. కంపార్ట్‌మెంటులో ఇంకా జనం ఉన్నారు సుమా అని కళ్ళతోనే సూచిస్తూ, సూట్ కేస్ తెరచి మాగజైన్స్ తీసి అతని చేతికిచ్చింది.

## 4

సరిగ్గా ఉదయం ఎనిమిది గంటలకు న్యూఢిల్లీ ప్లాట్‌ఫాం ముందాగింది ఎక్స్‌ప్రెస్... ప్రయాణికులంతా తొందర తొందరగా దిగేస్తున్నారు... సుధా, సురేంద్రా తమ సూట్‌కేసుల్ని చేత బట్టుకొని ప్లాట్‌ఫాం మీదికి వచ్చేశారు–

"మనం గమ్యం చేరుకున్నట్టేనా సురేంద్రగారూ" అని అడిగింది సుధ. సురేంద్ర ప్లాట్‌ఫాం చివరనున్న పెద్ద బోర్డును ఆమెకు చూపించాడు.

ప్లాట్‌ఫాం కిక్కిరిసినట్టుగా ఉంది. బయట కెళ్ళటానికి పదినిముషాలు పట్టింది–

"మన ప్రోగ్రాం ఆలోచించండి... ఎక్కడి కెళ్దాం...?" అంది సుధ.

"స్టేషన్‌కు దగ్గరలోనే మంచి లాడ్జి చూద్దాం."

"కొత్త ప్రదేశం గదా! ఇద్దరూ అనుభవం లేనివాళ్లం...ఏ లాడ్జికి ఎలాంటి స్వభావం ఉంటుందో మనకు తెలీదు."

"మీరేం గాభరా పడకండి. నేను బాగా ఎంక్వయిరీ చేస్తాను."

ఇద్దరూ స్టేషన్ బయటికొచ్చారు– బారులు తీరి ఆటోలూ, టాక్సీలూ, రిక్షాలూ–అరుపులూ–

సురేంద్ర ఒకరిద్దర్ని వచ్చీరాని హిందీలో లాడ్జీల గురించి అడిగాడు. మరిద్దర్ని ఇంగ్లీషులో అడిగాడు– ఒకాయన చాలా నెమ్మదిగా విని, చాలా దగ్గర్లో ఉన్న పారమౌంట్ లాడ్జిని సూచించాడు– ఆ లాడ్జి గురించి మళ్ళీ ప్రశ్నలు వేశాడు సురేంద్ర – ఆయన ఓపికగా సమాధానాలు చెప్పి "నడిచే వెళ్ళండి–" ఆ కనిపిస్తున్నదే అంటూ చూపించాడు–

ఇద్దరూ రోడ్డున పడ్డారు – దగ్గర్లోనే ఉంది మూడంతస్తుల 'పారమౌంట్' లాడ్జి.

రిసెప్షన్ కౌంటర్ దగ్గరకెళ్ళి రెండు సింగిల్ రూమ్స్ పక్కపక్కనే కావాలని అడిగాడు సురేంద్ర – కౌంటర్ దగ్గరున్న మనిషి వీళ్ళను ఎక్కణ్ణుంచి వస్తున్నారు అనడిగాడు హిందీలో. ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్నట్టు, మెడికల్ ఎగ్జామ్స్ రాయటానికి వచ్చిన స్టూడెంట్స్ మనీ చెప్పాడు – స్టూడెంట్స్ అనగానే అతను కాస్త శ్రద్ధగా చూశాడు వీళ్ళను – రెండో అంతస్తులో పక్కపక్కనే రెండు గదుల్ని వీళ్ళకు కేటాయించాడు– ఒక్కొక్క గదికి అద్దె అరవై రూపాయలు–

ఒక బోయ్ వీళ్ళను వెంటతీసుకొని గదులు చూపించాడు. గదులు అధునికంగా అందంగా నీట్‌గా ఉన్నాయి– సురేంద్ర సుధను ఆమె గదిలో విడిచి పక్కగదిలోకి వెళ్ళబోయాడు–

"మీకు అరగంట మాత్రం టైమ్ ఇస్తున్నాను– అంతలోగా మీరు మీ పనులన్నీ ముగించుకొని యిక్కడి కొచ్చేయాలి. అంతకంటే ఎక్కువ టైమైతే గట్టిగా కేకేస్తాను" అంది.

సురేంద్ర తలాడించి తన గదిలోకి వచ్చేశాడు. అరగంటలోనే తన పనులన్నీ పూర్తిచేసుకొని ఆమె గదిముంగిటి కొచ్చి తలుపు తట్టాడు.

"అరగంట అంటే ఖచ్చితంగా అరగంటకే వచ్చేశారే – అయితే మీ రింకో పదినిమిషాలాగాలి... అందాకా తలుపు తియ్యను–" అంది లోపల్నుంచే.

పదినిమిషాలపాటు బాల్కనీలో పచార్లు చేశాడు సురేంద్ర – తొమ్మిది కావస్తున్నా వాతావరణమింకా మసక మసకగానే ఉంది – చల్లటిగాలి శరీరాన్ని తాకుతోంది... రోడ్డంతా తేమగా కనిపిస్తోంది.

సుధ ఇరవై నిమిషాల తర్వాత తలుపు తెరిచింది... సురేంద్ర ఆమె దగ్గరగా వచ్చాడు – తలంటు స్నానం చేసిన తడిజుట్టును విదలగొట్టుకుంటూ తువ్వాలుతో తుడుచుకుంటూ ఒక అద్భుతమైన భంగిమలో నిల్చొనుంది. లేతాకుపచ్చరంగు చీరా, అదేరంగు బ్లౌజా–ఎర్రకలువలాంటి ముఖంతో, ఆ మంచు వాతావరణంలో ప్రకృతి కన్యలా కన్పించి, పరవశత్వం చెందాడు సురేంద్ర.

"లోపలకు రండి."

ఆమె వెనకాలే లోపలకు వెళ్ళి, ఆమె కేసే చూస్తూ, ఆమె తన్నెక్కడ పసిగట్టేస్తుందో అన్న సిగ్గుతో, ఆమె తన వేపు చూసినపుడు చూపులు మరల్చుకుంటున్నాడు.

జుట్టును పాయలుగా చీల్చి వదులుగా జడ అల్లుకుంది ఆమె–

"నాకు బాగా ఆకలేస్తోంది– కిందికి వెళ్ళి ఏదైనా తినేద్దాం" అంది –

అంతవరకూ ఆమె జుట్టు దీర్ఘత్వాన్నీ, మృదుత్వాన్నీ తన చూపుల్తో స్పృశిస్తున్న సురేంద్ర ఉలుక్కిపడ్డట్టు కదిలి "అలాగే చేద్దాం" అన్నాడు –

కిందికి వచ్చి పరోటాలు తిని టీలు తాగారు– ఇద్దరూ స్టేషన్‌లోకెళ్ళి తమ తిరుగు ప్రయాణానికి టిక్కెట్లు రిజర్వ్ చేసుకొని వచ్చారు–

ఇద్దరూ ఆమె గదికి చేరుకున్నారు–

"మధ్యాన్నం వరకూ చదువు కార్యక్రమం సాగిద్దాం – ఆ తర్వాతే మాటలు" అంది సుధ–సురేంద్ర బుద్ధిమంతుడిలా కుర్చీలో కూచొని పుస్తకాలు ముందేసుకున్నాడు. సుధ మంచం మీద కూచొని పుస్తకం తెరచి చదవటంలో మునిగి పోయింది.

☆ ☆ ☆

రాత్రి పదకొండు వరకు సుధ గదిలోనే ఉండిపోయాడు సురేంద్ర పరీక్షకు ప్రిపేరవుతూ–

"ఇక చదువు చాలిద్దాం రేపొద్దున ఎనిమిదికల్లా మనం పరీక్షహాలుకు చేరుకోవాలి గదా! ఇక నా గదికి వెళ్తాను– పొద్దున తొందరగా లేద్దాం" అంటూ లేచాడు సురేంద్ర.

సుధ పుస్తకం మూసేస్తూ "మీరు తొందరగా నన్ను నిద్రలేపాలి. అసలే నాది మొద్దునిద్ర" అంది.

"ఐదు గంటలకల్లా మీ తలుపు తడతాను– సరేనా– తలుపు వేసుకోండి గుడ్‌నైట్" అంటూ గదినుండి బయటకు నడిచాడు సురేంద్ర.

సుధ తలుపువేసి, పక్క సర్దుకొని లైట్ ఆర్పేసి మంచంపై వాలిపోయింది ఆవులిస్తూ–

రాత్రి మూడుగంటలు కావస్తూంది.

ఎవరో తలుపు బాదుతున్న శబ్దం. గట్టిగా బాదుతున్న శబ్దం–

హఠాత్తుగా మెలకువ వచ్చింది సుధకు–

తన గది తలుపులు బాదుతున్న శబ్దం – "సుధగారూ – " అంటూ లో గొంతుకతో పిలుస్తున్న స్వరం –

సురేంద్ర గొంతుకలా అనిపించి వెంటనే మంచంమీంచి లేచింది సుధ.

"సుధగారూ–" అంటూ వగరుస్తూ. పిలుస్తున్న స్వరం.

సుధ తొందరగా నడచి లైట్ వేసి తలుపు తీసింది –

ఎదురుగా సురేంద్ర ఆయాసంతో రొప్పుతున్నాడు – మనిషి నిటారుగా నిల్వలేక పోతున్నాడు – అతని రొమ్ము గాలి పీల్చుకోటానికి ఆరాటంతో ఎగిరెగిరి పడుతోంది– తెగ ఆయాసపడుతున్నాడు.

"అరే – యిదేమిటి – యిలా ఆయాస పడుతున్నారు – లోపలకు రండి" అంటూ తన చేతులతో అతన్ని పట్టుకొని నెమ్మదిగా లోపలకు చేర్చి మంచం మీద కూచోబెట్టింది–

"ఏమయింది– ఎందుకిలా–" తనకే అర్ధంగాకుండా ఆందోళనతో అడిగింది–

సురేంద్ర చాలా నెమ్మదిగా ఒక్కొక్కమాటే చెప్పాడు– అరగంట క్రితం రొమ్మును బంధించినట్టుగా ఊపిరాడని పరిస్థితి యేర్పడిందట– ఆస్త్మా ఎటాక్ వచ్చిందట– లేచి నాలుగు గ్లాసుల నీళ్ళు తాగేశాడట– ఆ నీళ్ళ చల్లదనం వల్ల కూడా మరింత ఎక్కువయిందట– ఇంతకు మునుపు రెండేళ్ళక్రితం యిలా ఒకసారి ఎటాక్ వచ్చిందట– మళ్ళీ ఎప్పుడూ లేదట. వాతావరణం మార్పు వల్ల చలి ఎక్కువగావటం వల్ల యిలా వచ్చిందట– వేసుకుందామంటే ఏ మాత్రలూ లేవట– ఇలా రావటం తనకే ఆశ్చర్యంగా ఉందట–

అతని పరిస్థితి అంతా సుధకు అర్ధమయింది.

మనిషి చాలా తీవ్రంగా బాధపడుతున్నాడు.

"ఇప్పుడెలా సురేంద్రా. మీకు తొందరగా ట్రీట్‌మెంటు జరిగేలా చూడాలి. నేను తొందరగా కిందికి వెళ్ళి హోటల్ బోయ్‌ని పట్టుకొని, దగ్గర్లో ఎవరైనా డాక్టరో, నర్సింగ్‌హోమో వుందేమో ప్రయత్నిస్తాను – ఒక్క క్షణంలో వస్తాను మీరు మంచం మీద అలా బోర్ల పడుకోండి" అంటూ చకచకా బయటకు నడచి మెట్లు దిగివచ్చి అటుయిటూ చూసింది– ఎవరూ ఎక్కడా లేరు. కౌంటర్‌లో కూడా ఎవ్వరూ లేరు... అటూ యిటూ పిచ్చిపట్టినదానిలా తిరిగింది బోయ్– బోయ్

అని గట్టిగా పిలుస్తూ– ఎక్కడో అలికిడయిన శబ్దం. ఏదో గదితలుపు తెరుచుకుంది.

హోటల్ కుర్రాడు బయటకొచ్చాడు. 'క్యామేడమ్' అంటూ– సుధ ఆ కుర్రాడికి పరిస్థితి చెప్పింది. దగ్గర్లో డాక్టర్‌గాని, నర్సింగ్‌హోం గాని వుందా అని ఎంక్వయిరీ చేసింది.

"పక్క వీధిలోనే నర్సింగ్ హోమ్ ఉంది... చాలా దగ్గర... ఎవరో ఒకరు ఉంటారు. వెళ్దాం పదండి–" అన్నాడు కుర్రాడు.

ఇద్దరూ పరుగులాంటి నడకతో పక్కవీధి చేరుకున్నారు. ఐదు నిమిషాలు నడిచేసరికి ఓ నర్సింగ్ హోమ్ కనిపించింది – సుధ తొందరగా లోపలికి వెళ్ళి ఓ కుర్చీలో కునికిపాట్లుపడుతున్న నర్స్‌ను లేపి విషయం చెప్పి 'ప్లీజ్ క్విక్' అంది. "డాక్టరుగారు లేరే" అంది– "పేషెంట్ ఎక్కడ" అంది. సుధ పేషెంటు ఎక్కడున్నదీ చెప్పింది. "మీ రెవరైనా వచ్చినా సరే... లేదా నేను కూడా డాక్టర్నే... ఒక సిరంజీ డెకడ్రాన్ ఇంజక్షనూ నాచేతి కిచ్చినా సరే" అని కన్విన్స్ చేసింది. నర్స్ మరేం తర్కం చేయకుండా, యింజక్షనూ సిరంజీ తెచ్చి యిచ్చింది – హోటల్ కుర్రాడు తమ హోటల్ గురించి చెప్పి తాను మళ్ళీ వస్తానన్నాడు.

వాటిని తీసుకొని సుధ తొందరగా తమ గదికి వచ్చేసింది–

గదిలో సురేంద్ర మంచం మీద బోర్లా పడుకొని చాలా ఇబ్బంది ఫీలవుతున్నాడు. అతని గొంతుకలోంచి గుర్‌గుర్ శబ్దాలు వినిపిస్తున్నాయి.

"వన్ మినిట్ సురేంద్రా. డెకడ్రాన్ తెచ్చాను. ఇంజక్షన్ చేస్తాను– వెంటనే మీకు రిలీఫ్ వస్తుంది" అంటూ సిరంజ్‌లోకి మందు ఎక్కించుకుని హోటల్‌కుర్రాడి సాయంతో సురేంద్ర చేతిని పట్టుకొని నెమ్మదిగా యింజక్షన్ చేసింది సుధ.

"మీరలాగే పడుకోండి. అరగంటలో మీకు రిలీఫ్ వస్తుంది." అంటూ తాను మంచం మీదే ఒకవారగా కూచొంది సుధ.

"వేడిగా రెండు కప్పుల టీ పట్టుకురా బాబూ" అంటూ డబ్బులిచ్చి ఆ కుర్రాణ్ణి పంపింది–

కుర్రాడు స్టేషన్ దగ్గర కెళ్ళి ఫ్లాస్కులో టీలు తెచ్చి యిచ్చాడు – టీ తాగి కొంత రిలీఫ్ పొందాడు సురేంద్ర. సుధ బోయ్ చేత సిరంజ్, డబ్బా, నర్సింగ్‌హోమ్‌కు పంపించింది – ఆ కుర్రాడికి కూడా ఐదురూపాయలిచ్చి థాంక్స్ చెప్పింది.

అరగంట గడిచేసరికి బాగా రిలీఫ్ వచ్చింది సురేంద్రకు–

"రైతుబిడ్డ ప్రతాపం తెలిసొచ్చిందా సురేంద్రగారూ–" అంటూ జోక్ చేసింది సుధ.

"మీకు బాగా టెన్షన్ తెచ్చినట్టున్నాను. మీకు చాలా శ్రమ యిచ్చాను. సారీ" అన్నాడు కృతజ్ఞత నిండిన చూపులతో.

"ఈ ఫార్మల్ మాటలు వదిలెయ్యండి. ఓ గంటసేపు మీరు ఇలాగే పడుకొని రెస్టు తీసుకోండి... ఇంతలో తెల్లారుతుంది." అంది సుధ–

సురేంద్ర మంచం మీద నుంచీ లేవబోతూ "ఇక నా గదికి వెళ్తాలెండి- మీ నిద్ర పాడుచేశాను మీరు పడుకోండి" అన్నాడు.

"మీ పద్ధతి నాకేం నచ్చలేదు... ఇక్కడే పడుకోండి... నాకే యిబ్బందీ లేదు" అంది తీక్షణంగా.

సురేంద్ర మంచం మీద ఒత్తిగిలి పడుకొన్నాడు.

సుధ లేచివెళ్ళి సురేంద్ర గదిని లాక్‌చేసి వచ్చి, కుర్చీలో కూచొని పుస్తకం తెరిచింది-

☆ ☆ ☆

ఏడుగంటలకల్లా పనులన్నీ ముగించుకొని టిఫిన్ చేసి, రోడ్డున పడ్డారు ఇద్దరూ. బస్సెక్కి ఎనిమిది దాటుతూండగా పరీక్ష హాలుకు చేరుకున్నారు-

పరీక్షలు కాగానే కలుద్దాం అంటూ యిద్దరూ విడిపోయారు-

పదకొండు గంటలకు పరీక్షలురాసి, వచ్చిన ప్రశ్నల్ని గురించి చర్చించుకుంటూ హోటల్ చేరుకున్నారు... ఇద్దరూ బాగా ఆన్సర్ చేశామనుకొని తృప్తి ననుభవించారు-

ఇద్దరూ భోంచేసి తర్వాతి కార్యక్రమం గురించి చర్చించుకున్నారు- "ఎల్లుండి ఉదయం ప్రయాణం గదా- రేపు సిటీ అంతా చూద్దాం" అన్నాడు సురేంద్ర. సిటీ చూడ్డం గురించి ఎంక్వయిరీ చేశారు- స్టేషన్ దగ్గర్నుండీ సిటీ చూపించే బస్సు ఉదయం బయలుదేరుతుందని ఎంక్వయిరీలో తెలిసింది-

ఆ రాత్రి దగ్గర్లో ఉన్న ఓ పిక్చర్ ప్యాలెస్‌కు వెళ్ళి ఓ ఇంగ్లీషు సినిమా చూసి వచ్చారు- మళ్ళీ రాత్రికి అటాక్ రాకుండా ముందు జాగ్రత్తగా టాబ్లెట్లు తీసుకున్నాడు సురేంద్ర-

మరుసటిరోజు పొద్దున్నే స్టేషన్ కొచ్చారు- టికెట్లు తెచ్చాడు సురేంద్ర- ఏడున్నరకు బయల్దేరింది బస్సు. సాయంత్రం నాలుగున్నరవరకూ సిటీలోని ముఖ్యమైన ప్రదేశాలన్నిటినీ చూశారు. లాల్‌ఖిల్లా. జుమ్మామసీదు, విజయఘాట్, శాంతివనం, రాజ్‌ఘాట్, గాంధీ నేషనల్ మ్యూజియం, పార్లమెంట్ భవన్, రాష్ట్రపతి భవన్, ఇండియాగేట్, కుతుబ్‌మినార్, యిలా వరుసగా చూశారు- పగటిపూట కూడా బాగా చలి అనిపించింది-

"పరీక్షలేమైతే ఏంగానీ, యీ ట్రిప్ బాగా ఎంజాయ్ చేశాం గదూ" అంది సుధ.

"మీరు పక్కన వుండటం వల్లే నాకీ ఎంజాయ్‌మెంట్ అంతా - లేకపోతే చాలా డ్రైగా ఉండేది." అన్నాడు సురేంద్ర.

సుధ ఒక్కక్షణం అతని ముఖంలోకి చురుగ్గా చూసి- "ప్రయాణాల్లో తోడు ఎవరున్నా అలాగే ఫీలవుతాం" అంది.

"ఎవరో తోడుండటం వేరు - మీరు వుండటం వేరు - మీరు నన్ను అపార్థం చేసుకోగూడదు-" అన్నాడు సురేంద్ర అమె ముఖంలోకి ఆరాధనగా చూస్తూ.

☆ ☆ ☆

మరురోజు ఉదయం కె.కె. ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారిద్దరూ—

"ఇంతవరకూ మనం పరీక్షల గొడవల్లోపడి ఆ విషయాలే ఎక్కువ మాటాడుకున్నాం— ఇక మీ సొంత విషయాలు చెప్పండి" అంది సుధ.

"సొంత విషయాలంటే..."

"మీరూ, మీ కుటుంబమూ— అన్న దమ్ములూ, చెల్లెళ్ళూ మీ వ్యవసాయం— యిలా ఎన్నయినా చెప్పొచ్చు గదా."

సురేంద్ర చిన్నగా నవ్వాడు. "ఏమున్నాయి చెప్పుకోటానికి— ఎన్నైనా చెప్పొచ్చు అంటారు మీరు – మేం నలుగురు అన్నదమ్ములం— నేను రెండోవాణ్ణి. మా అన్నయ్య వ్యవసాయం చూసుకుంటాడు— ఆయన కిద్దరు పిల్లలు—మిగతా యిద్దరు తమ్ముళ్ళూ ఒకడు యింటరూ, మరొకడు టెన్తూ చదువుకుంటున్నారు— ఇద్దరు చెల్లెళ్ళు— ఇంకా పెళ్ళిళ్ళు కాలేదు— టెన్త్‌దాకా ఉన్న వూళ్ళోనే చదివి చదువులు ఆపేశారు వాళ్ళు— మా రాబడి అంతా వ్యవసాయంలోనే— అనంతపురం జిల్లా వ్యవసాయం దేశానికంతా తెలిసిందే గదా— బావుల్లో నీళ్ళులేని పరిస్థితులిప్పుడు – వచ్చే తరానికి 'ఊత' అంటే ఏమిటో తెలియదు బహూశా – బోలెడు ఖర్చులు పెట్టి బోర్లు వేయించాం – ఆ వచ్చే నీళ్ళు అంతంత మాత్రమే, వర్షాలు అంతంత మాత్రమే గదా— మెట్టపైరు కళ్ళ చూసేది, ఏ మూడేళ్ళకో ఓసారి— ఈలోగా అప్పులూ ఖర్చులూ— నా ప్రాక్టీస్‌వల్ల కుటుంబానికి అంతో యింతో ఊరట— మా కులంలో ఆడపిల్లల పెళ్ళిళ్ళు అంటే డబ్బుతో చెలగాటం లాంటిది – ఒక తరం కిందట ఎంతో గొప్ప స్థితిలో ఉన్న కుటుంబం మాది. ఇప్పుడు కింది మధ్యతరగతిలోకి చేరాం— మరో తరానికి మాలాంటి వాళ్ళంతా వ్యవసాయ కూలీలుగా మారినా ఆశ్చర్యం లేదు— మా పల్లెల నాగరికత కూడా అంతంత మాత్రమే – నీళ్ళేగదా నాగరికత— నీళ్ళులేని మా ప్రాంతాలు, నీళ్ళున్న ప్రాంతాల వాళ్ళ ఊహలకు కూడా అందనివి— 'గడియ తీరికాలేదు, దమ్మిడీ ఆదాయమూ లేదు' అన్న సామెత మాకెప్పుడూ కొత్త సామెతే— ఇంతకంటే ఏం చెప్పమంటారు—" అన్నాడు సురేంద్ర. అతని మాటల్లో కన్పించిన నిర్వేదానికి చలించిపోయింది సుధ—

"నిజమే సురేంద్రగారూ! దేశానికి వెన్నెముకగా చెప్పబడుతున్న రైతులు, ఇప్పుడు వెన్నెముక లేనివాళ్ళయ్యారు— దేశంలో ఎన్ని నదులో, ఎన్ని నీళ్ళో అయినా తాగటానికి నీళ్ళులేని ఊళ్ళు ఉన్నాయని చెప్పుకోవటం ఎంత దౌర్భాగ్యం! రాయలసీమ మరో ఇథియోపియా కావటానికి ఇక ఎంతో కాలం పట్టదేమో అనిపిస్తుంది – మా తాతగారిది కూడా వ్యవసాయ కుటుంబమే. మా నాన్నగారితరానికి అన్నీ పోగొట్టుకున్నాం— మా నాన్న హైస్కూల్ టీచర్... మాది చాలా చిన్న కుటుంబం— నేనూ, మా అన్నయ్యా! మా అమ్మ పోయి చాలా కాలమయింది— తన శక్తంతా ధారపోసి మానాన్న మాకు చదువులు చెప్పించాడు— మా నాన్న రిటైరయి రెండేళ్ళయింది— ఇప్పటికీ సొంతయిల్లు లేకుండా అద్దె ఇంట్లో ఉంటున్నాం..." చెబుతూ చెబుతూ సురేంద్ర ముఖంలోకి చూసింది సుధ. అతని ముఖంలో గూడుకట్టుకొన్న విషాదంలాంటిది చూసి మౌనంగా ఉండి పోయింది.

ఆమె మాటలు ఆపటం చూసి, "ఏమిటీ ఆగిపోయారు?" అన్నాడు.

"మనం మన వాస్తవజీవిత ప్రపంచాల్లోకి వెళ్లేసరికి అప్పుడే వాతావరణంలో ఎంత మార్పు వచ్చిందో చూశారూ- చాలా మంది జీవితాల మధ్య ఒక అంతస్సూత్రం ఉందేమో అనిపిస్తుంది" అంది సుధ.

☆ ☆ ☆

సికింద్రాబాద్ స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ దిగి ఇంటికి చేరుకొనేసరికి ఎనిమిది దాటింది. కాంపౌండువాల్ దగ్గర వీరి కోసమే ఎదురుచూస్తూ తచ్చాడుతున్నారు ప్రభాకరూ, ప్రభావతి – వీళ్ళ ముఖాలు అల్లంత దూరంలో కనపడగానే వాళ్ళ ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి–

గేటు దగ్గరకు రాగానే. "ఈ నాలుగు రోజుల్నుండీ మీ అన్నయ్యకు మీ కలవరింతే– రకరకాల ప్రశ్నలతో నన్ను వేధించారనుకో– మీ ముఖాలు కనిపించే సరికి నా గుండెల మీద బరువు దిగినట్టు అయింది– జర్నీ హాపీగానే జరిగింది కదా" అంటూ పలకరించింది ప్రభావతి.

ప్రభాకర్ సుధ చేతిలోని సూట్‌కేసు అందుకుంటూ "పరీక్షలు బాగా రాశారు గదా, ఎక్కడా ఏమీ యిబ్బంది కలుగలేదుగదా!" అంటూ ప్రశ్నలు వేశాడు. సుధ తగిన సమాధానాలు చెపుతూ లోపలకు వచ్చింది. సురేంద్ర ప్రభాకర్ అడిగిన వాటికన్నీ ఓపికగా జవాబులు చెబుతూ ఆయన అనుమానాలన్నీ తీర్చేస్తున్నాడు.

స్నానాలు చెయ్యటం, టిఫిన్లు తింటం అయిపోయేదాకా ఢిల్లీ కబుర్లే – ఢిల్లీ నుండి బుజ్జికోసం తెచ్చిన బొమ్మల్ని ముందువేసింది సుధ– "సురేంద్రగారు వద్దన్నా బలవంతంగా బుజ్జికోసం ఈ గౌను కొన్నారు" అంటూ గౌను తీసి చూపించింది సుధ–

సురేంద్రకు ఆస్త్మా ఎటాక్ రావటం, ట్రీట్‌మెంట్ యివ్వటంతో సహా అన్ని కబుర్లూ ఒంటిగంట దాకా సాగుతూనే వున్నాయి. సురేంద్రకు చాలా థాంక్స్ చెప్పాడు ప్రభాకర్–

ఆ రోజంతా అక్కడే గడిపేశారు.

మరుసటిరోజు పొద్దున్నే సుధ ప్రయాణం మొదలెట్టింది. 'ఇంకో రోజైనా వుండవే' అని అన్నావదినలు బతిమాలినా వినిపించుకోలేదు. "అక్కడ నాన్నగారు ఒక్కరే ఉంటారు నాకోసం ఎదురుచూస్తూ– ఈ రోజైనా చేరుకోకపోతే రేపు ఆయన పరుగులు తీస్తూ వస్తారు... నేను వెళ్ళితీరాలి వదినా సంక్రాంతికి మీరెటూ అక్కడికి వస్తున్నారు గదా" అంది సుధ.

"సురేంద్రగారూ! ఒక చిన్న రిక్వెస్ట్. మీరు మా చెల్లాయిని కర్నూల్‌లో ఇంటిదాకా దింపి వెళ్ళాలి." అంటూ అభ్యర్థించాడు.

"తప్పకుండానూ..." అన్నాడు సురేంద్ర.

పదిగంటలకల్లా భోజనాలు ముగించేసి యింటి నుండి బయల్దేరారు సురేంద్రా సుధా–

## 5

నరసింగరావుపేటలో వున్న తమ యింటిముందు రిక్షాలో దిగారు సుధా సురేంద్రా–

వరండాలో వాలుకుర్చీలో కూచొని ఏదో పత్రిక చూస్తున్న సుధతండ్రి సత్యనారాయణగారు వీళ్ళ రాకను గమనించి లేచి ఎదురుగా వచ్చారు.

సుధ సురేంద్రను తన తండ్రికి పరిచయం చేసింది– ఢిల్లీదాకా తనతోపాటు వచ్చిన విషయాన్ని కూడా చెప్పింది. అయన సురేంద్రను ఆప్యాయంగా ఆహ్వానించాడు.

ముఖాలు కడుక్కున్న తర్వాత సుధ కాఫీలు తయారు చేసి ఇచ్చింది వాళ్ళకి – సత్యనారాయణగారు వాళ్ళ పరీక్ష గురించి, ఢిల్లీ గురించి ఆసక్తిగా అడిగారు. సుధ ఆయనకు విశేషాలన్నీ వివరించింది.

సాయంత్రం కావస్తూండగా 'నేనలా మార్కెట్‌కు వెళ్ళొస్తానమ్మా' అని సంచీ తీసుకొని బయటికెళ్ళారు సత్యనారాయణగారు.

☆ ☆ ☆

రాత్రి భోజనాలయిం తర్వాత సుధా, సురేంద్రా గదిలో కూచొన్నారు– సత్యనారాయణగారు పక్కింటాయనతో ఏదో బాతాఖానీ వేస్తున్నారు.

"నేను ఉదయం వెళ్తాను సుధగారూ" అంటూ ఏదో చెప్పబోతున్నట్టు ఆమె ముఖంలోకి శ్రద్ధగా చూశాడు సురేంద్ర.

అతని కెదురుగా కుర్చీలో కూచొన్న సుధ "అలాగే వెళ్దురుకానీండి... ఈ వారంరోజులు మనం కలిసుండీ, మీరు వెళ్తాననగానే ఏదో వెలితి కనిపిస్తూందండీ," అంది సుధ.

"మీరు నిజంగా అలా ఫీల్ అవుతున్నారా సుధగారూ–"

"అంటే నేనేదో ఫార్మాల్టీకోసం మాటాడుతున్నా ననుకొంటున్నారా..."

"ఐతే నేను చాలా ఆనందిస్తున్నాను సుధగారూ! నిజం చెప్పమంటారా? మిమ్మల్ని విడిచి వెళ్ళాలంటే నాకూ చాలా బరువుగా వుంది... మనది కొద్ది రోజుల పరిచయమే అయినా ఎన్నో ఏళ్ళుగా మనం తెలిసినవారమనే ఫీలింగ్ వుంది నాలో– మీ స్నేహం నన్ను చాలా గాఢంగా కుదిపేసింది. చాలా ఏళ్ళుగా దేనికోసమో అన్వేషణ చేసి చేసి మిమ్మల్ని ఆవిష్కరించుకున్నట్టుగా వుంది నాకు" అంటూ ఆగిపోయాడు. సుధ ఏవో కొత్త మాటలు వింటున్నట్టు అతని ముఖంలోకి చిత్రంగా చూసింది. సురేంద్ర కళ్ళు వింత కాంతితో మెరుస్తున్నాయి. ఏదో పరవశత్వం అతని చూపుల్లో తొణికిస లాడుతోంది.

"మీరేమిటి యిలా పూనకం వచ్చినట్టుగా మాటాడేస్తున్నారు" అంది.

"మీ రన్నది నిజమేనేమో సుధగారూ! నేను నేనులా మాట్లాడటం లేదేమో! అయితే అందుకు కారణం నిస్సందేహంగా మీరే! నన్ను అర్థం చేసుకుంటే చాలు–"

"నిజంగా మీరు నా కర్థంగావటం లేదు– మీ వాలకంలో ఏదో మార్పు కనిపిస్తోంది... నేనొస్తా బాబూ – నాకు వంటింట్లో సర్దాల్సిన పని చాలా వుంది" అంటూ లేచి వెళ్ళబోయింది సుధ.

అకస్మాత్తుగా ఆమె చేయి పట్టుకొని ఆపాడు సురేంద్ర! "కూచోండి... మీరు ఇప్పుడిలా నన్ను వాగించి వెళ్ళటానికి వీల్లేదు–మీతో నేను చాలా మాట్లాడాలి" అన్నాడు.

తన చేతినీ, తన చేతిని పట్టుకొన్న అతని చేతిని చూస్తూ ఆశ్చర్యంతో నిలచిపోయిందామె–అతనిచేయి కొద్దిగా కంపిస్తున్నట్టు అనిపించింది ఆమెకు.

"ముందు చేయి వదలండి. ఏమిటి మీరు మాటాడదలుచుకున్నారు... నన్ను కన్ఫ్యూజన్‌లో ముంచేస్తున్నారు మీరు" అంటూ కూచుంది సుధ.

సురేంద్ర ఆమె చేయి వదిలి, "మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకోనంటే చెప్పదలచుకున్నదేదో చెబుతాను" అన్నాడు.

ఆమెకు అతని ధోరణి చిత్రమనిపించింది. అతని ముఖంలో చూపులో ఏదో కొత్తదనం... తనకు అర్థమయీ కానట్టు అనిపించే కొత్తదనం... ఆమె అంతరాంతరాల్లో ఏదో మెదిలినట్టయి "చెప్పండి" అంది అతని ముఖంలోకే చూస్తూ–

"సూటిగా చెబుతాను... మీరు కోపగించుకోకూడదు... నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను సుధగారూ" అని ఆగిపోయాడు.

ఇలాంటి మాట ఏదో అతని నోటి నుండి వినాల్సివస్తుందని అతని వాలకం సూచించినా, తీరా నోటినుండి ఆ మాట వచ్చేసరికి క్షణకాలం చలించిపోయింది ఆమె. మరో క్షణానికే తన్ను తాను అదుపులోకి తెచ్చుకొని "ఇలాంటి ప్రమాదకరమైన మాటలేవో వినాల్సివస్తుందనే అనిపించింది మీ ధోరణి చూస్తే" అంది వాతావరణాన్ని కాస్త తేలికచేయటానికి.

"నే నెంతో సీరియస్‌గా చెబితే మీరేమిటి యిలా తీసిపారేసినట్టు మాటాడుతున్నారు?"

"ఇందులో పెద్ద సీరియస్ ఏముంది సురేంద్రగారూ! చాలా సహజంగా ఒక అబ్బాయి ఒక అమ్మాయితో అనే మాటే గదా మీరూ అన్నది, నేను ఏ కొత్తగానో పరువంలోకి వచ్చిన ఆడపిల్లనయితే మీ మాట వినగానే మూర్ఛపోవటమో, సిగ్గుతో కొంకర్లు తిరగటమో చేసేదాన్ని" అంది శబ్దమొచ్చేలా నవ్వుతూ–

"మీరు నా మాటను చాలా ఫార్మల్‌గా తీసుకుంటున్నారు..."

"లేదు– చాలా ప్రాక్టికల్‌గా ఆలోచించి మాట్లాడుతున్నాను–మన పరిచయమెంత – కనీసం పదిరోజులు కూడా దాటలేదు– యాదృచ్ఛికంగా మనం కొద్దిరోజులపాటు కలసి ప్రయాణం చేశాం– సరదాగా స్నేహితుల్లాగా తిరిగాం– ప్రేమలు ఒలకబోసుకొనేంత, మన మధ్య ఏం నడిచిందని? – ఈ కొద్దిరోజుల పరిచయానికే మీరు 'ప్రేమా, దోమా' అనే పేర్లు పెట్టుకుంటారని యీ క్షణం వరకూ నే నస్సలు అనుకోలేదు– మీరు వాస్తవప్రపంచంలోకి దిగిరండి. మీతోపాటు మరో అబ్బాయి కలసి యీ కొద్ది రోజులూ ప్రయాణం చేశారనుకోండి– అంతకుమించి ఆలోచనలు వద్దు

సురేంద్రగారూ– వాటి పరిణామాలు మీరనుకొనేంత ఆనందదాయకంగా ఉండవు–" అంది సుధ. ఆమె గొంతులోని నిశ్చలత. గాంభీర్యం సురేంద్రను చకితుణ్ణి చేశాయి. క్షణంలో అతని ముఖం వాడిపోయింది–

ఇద్దరి మధ్య రెండు నిముషాలు భరించలేనంత నిశ్శబ్దం వణికింది.

సురేంద్ర మెల్లగా తేరుకొని, "మీరు మాట్లాడింది నిజంగాదు సుధగారూ! అప్పుడే వయసులోకి అడుగు పెడుతున్న కుర్రాడిలా మీరు నన్ను లెక్కగట్టి మాట్లాడుతున్నారు– నే నేదో ఊహా ప్రపంచంలో తేలిపోతూ మాట్లాడటం లేదు. కొద్దిరోజులే అయినా నేను మిమ్మల్ని ఒక పరిశోధన చేసినంతగా అర్థం చేసుకున్నాను. మీకు నా మనసు చెప్పకుండా యిక్కణ్ణుంచి కదలటం సాధ్యం కాదనిపించింది. మనమిద్దరం జీవిత భాగస్వాములు కావాలనే ఉద్దేశంతోనే నా మనసు మీ ముందు పరచాను. మిమ్మల్ని నేను ఫోర్స్ చేయటం లేదు– నేనంటే మీకు సదభిప్రాయం ఏర్పడివుంటేనే, నా పట్ల మీకు యిష్టం ఏర్పడి వుంటేనే నన్ను అంగీకరించండి... ఒక్కమాట గుండెల్లోంచి చెప్పండి సుధగారూ– నేనంటే మీకు యిష్టమేనా" అనడిగాడు.

"మీరు ఇష్టం లేకపోవటం ఏమిటి– మీరంటే మంచి అభిప్రాయం వుండే గదా మీతో కలసి ప్రయాణం చేశాను."

"నేననేది ఆ యిష్టం గురించి కాదు. నా పట్ల ప్రేమభావం నిజంగా మీలో లేదా? చెప్పండి సుధగారూ–"

సుధ మౌనంగా తలవంచుకుంది.

మళ్ళీ నిశ్శబ్దం.

"చెప్పండి సుధగారూ..."

"'ప్రేమ'అనే అరిగిపోయిన పదాలు వాడాలంటే నాకు చాలా ఎబ్బెట్టుగా ఉంటుంది సురేంద్రగారూ! మనం ఆలోచించాల్సింది మనకు ఒకరిపట్ల ఒకరికి గల యిష్టాన్ని గురించీ, ప్రేమల్ను గురించీ కాదు– మనం జీవితాన్ని గురించి ప్రాక్టికల్‌గా ఆలోచించాలి. నేను ప్రాక్టికల్ మనిషిని– నేను క్షణికమైన ఆవేశాల్ని ఉద్రేకాల్ని నమ్మను. మీరన్నట్టు మనిద్దరి మధ్యా ప్రేమలాంటిది ఉందనే ఒప్పుకొందాం– కాని ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే ఈ ప్రేమల కంటే బలీయమైనది జీవిత వాస్తవికత – మీరునెమ్మదిగా ఆలోచించండి–"

"నేను బాగా ఆలోచించే నిర్ణయానికి వచ్చాను సుధగారూ–"

"ఏమిటి మీరు బాగా ఆలోచించింది– ప్రేమించటం గురించీ, పెళ్ళి చేసుకోవటం గురించే గదా, అంత తేలికగా తీసుకోదగ్గ నిర్ణయంగా కనిపించిందా మీకిది?..."

"లేదు–లేదు– మీరు అంగీకరిస్తేనే–"

"నేను అంగీకరించటం గురించి కాదు– మీ కుటుంబ పరిస్థితులూ, మా కుటుంబ పరిస్థితులూ కూడా దృష్టిలో ఉంచుకోవాలి– మీకింకా పెళ్ళికావాల్సిన ఇద్దరు చెల్లెళ్ళున్నారు– చదువుకోవాల్సిన యిద్దరు తమ్ముళ్ళున్నారు– నిన్ను కష్టపడి చదివించిన అన్నగారున్నారు– మీ కుటుంబంపై భారంగా ఉన్న అప్పు ఉంది– మీ

పెళ్ళిమీద సహజంగా న్యాయంగా మీ వాళ్ళకు ఆశలు ఉండే ఉంటాయి. మీరు చదివిన చదువుకు మీ కులంలో లక్షల కట్నం మీకు వస్తుందన్న యధార్థం ఏ మాత్రం విస్మరించటానికి వీలుకానిది. నా వైపు కూడా ఆలోచించండి– మా నాన్నగారు ఇప్పటికీ సొంత యిల్లు లేని స్థితిలో ఉన్నారు. కట్నకానుకలు యివ్వటానికి మానాన్నగారి దగ్గరగానీ, మా అన్నయ్య దగ్గరగానీ ఏ నిల్వలూ లేవు– కట్నం యివ్వగల శక్తి లేకపోవటమే గాదు సురేంద్రగారూ! నేను కట్నానికి వ్యతిరేకిని కూడా– డబ్బులు పోసి ఒక మగవాణ్ణి కొనుక్కొని, ఆ వ్యక్తితో జీవితాంతం కాపురం చేయటం నా ఊహలో కూడా లేని విషయం– రేపు ఢిల్లీలోనో, కర్నూల్‌లోనో పి.జి. సీటు వస్తే దాన్ని కూడా చదవటం నా ఆశయం. పెళ్ళికోసం నా చదువును కూడా త్యాగం చేయలేను– నన్ను నన్నుగా స్వీకరించే వ్యక్తి నాకు కావాలి– మరొక ముఖ్యవిషయం కూడా మీరు గుర్తుంచుకోవాలి– మీ కులమూ, మా కులమూ కూడా ఒకటి కావు. మన కులాల మధ్య సాంఘికమైన అంతరాలున్నాయి... కట్నమూ లేకుండా, అందులోనూ కులాంతరమూ అయిన నన్ను చేసుకోగల ధైర్యమూ, పరిస్థితులూ, మీకు ఉన్నాయేమో కూడా మీరు ఆలోచించుకోవాలి... ఏదో యీ వారం రోజుల ప్రయాణంలో, ఆకర్షణకు లొంగి – ఆవేశంలో, మూడ్‌లో ఒక నిర్ణయానికి రావద్దు సురేంద్రగారూ– మన వారంరోజుల పరిచయాన్ని ఒక అనుభవంగా గుర్తుంచుకోండి– ఎక్కువగా టెన్షన్ అనుభవించకండి– బాగా ఆలోచించండి– ఈ రాత్రంతా ఆలోచించండి – ఊరుకెళ్ళి స్థిమితంగా ఆలోచించండి. నా మాటలు మిమ్మల్ని హర్ట్ చెయ్యటానికి కాదు. మీరు ఆలోచించుకోటానికే అని అర్థం చేసుకోండి–" అంటూ లేచి నిలబడింది సుధ.

సురేంద్ర ఆమె వేపే చూస్తూ, ఆమె మాటలు మెదడులో వలయాలు సృష్టిస్తూండగా దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

"టేకిట్ యీజీ సురేంద్రగారూ, మిమ్మల్ని నేనేమైనా బాధపెట్టానా..."

"అబ్బే లేదు సుధగారూ! నేను..." అని యింకా ఏదో చెప్పబోతూండగా, "ఇక ఇప్పుడు మీరేమీ చెప్పకండి... పది దాటింది– మీరు పడుకోండి– నా మాటల్ని సిన్సియర్‌గా సీరియస్‌గా తీసుకొని ఆలోచించుకోండి– ఒక నిర్ణయానికి వస్తే అవసరమనిపిస్తే ఉదయం మాట్లాడుకుందాం–సరేనా–గుడ్‌నైట్–" అంటూ గదినుంచి బయటికి వచ్చి తలుపులు అడ్డంగా లాగి వంటింట్లోకి నడిచింది సుధ.

సురేంద్ర అలాగే మంచం మీద వాలి చూరువేపు చూస్తూండిపోయాడు.

☆ ☆ ☆

"అమ్మా! సుధా! ఏడు కావస్తోంది– లేవమ్మా" అన్న తండ్రి మాటలు వినిపించి ఉలిక్కిపడ్డట్టు మంచం మీద నుంచీ లేచింది సుధ.

సూర్యకాంతితో గదంతా తెల్లగా వెలిగిపోతోంది. "ఎంత మొద్దునిద్ర–" అనుకుంటూ జుట్టు సవరించుకొని బాత్‌రూమ్ కెళ్ళింది.

పదినిమిషాల తర్వాత బయటకు వచ్చి, వాలుకుర్చీలో కూచుని పేపర్ చూస్తున్న తండ్రితో "సురేంద్రగారు లేచారా నాన్నా" అని అడిగింది.

"నేనా గదివేపు చూడలేదమ్మా- ఇంకా నిద్రపోతున్నారేమో" అన్నారు పేపర్లోనే తల వుంచి.

సుధ ఆ గదివేపు నడిచింది- వేళ్ళతో మెల్లగా తలుపులు నెట్టి "సురేంద్రగారూ" అంటూ లోపల కడుగు పెట్టింది.

మంచం ఖాళీగా ఉంది.

'ఇంత పెందరాళే ఎక్కడికెళ్ళారబ్బా-' అనుకుంటూ బయటకు రాబోతూ టేబుల్‌వేపు చూసింది. టేబుల్ మీద సురేంద్ర సూట్‌కేసు లేదు. బట్టలు తగిలించే వంకీలకేసి చూసింది. సురేంద్ర బట్టలు లేవు- ఆశ్చర్యంతో గదంతా కలయ చూస్తూండగా, టీపాయ్‌మీద ఒక తెల్లకాగితమూ, దానిమీద పేపర్ వెయిటూ కన్పించి ఒక అడుగు ముందు కేసి, పేపర్ వెయిట్ పక్కనపెట్టి, ఆ కాగితం చేతుల్లోకి తీసుకుంది-దానిమీద ఒకే ఒక్క వాక్యం.

"నన్ను క్షమించండి సుధగారూ"

- సురేంద్ర

ఆ వాక్యం చదవగానే క్షణకాలం ఆమె మెదడు మొద్దుపారినట్టయి, వెంటనే ఏదో స్ఫురించి, ఒక నిర్లిప్తపు చిరునవ్వు పెదాలమీద వెలిసింది- రెండు క్షణాల తర్వాత గదంతా మారుమోగేట్టు గలగలా పగలబడి నవ్వింది ఆమె-

*(యువ-జూలై 1988)*

★ ★ ★